సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శుక్రవారం । 31 । జనవరి । 2025



ఫిర్యాదులపై స్పందించాలి

డయల్ 100 ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు వెంటనే స్పందించి ఘటనా స్థలికి చేరుకోవాలని ఆర్గనైజేషన్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా సూచించారు. - 8లో ▸



నూతన ఆవిష్కరణలు అవసరం

ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణలు అవసరమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
$33^0/18^0$

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది.



ఇప్పటికే మడికొండలో ప్రముఖ కంపెనీల బ్రాంచ్‌లు

- సయాంట్, క్వాడ్రంట్, జెన్‌ప్యాక్ట్‌లు.. ఫాక్స్‌కాన్ సంప్రదింపులు
- దావోస్‌లో అగ్రిమెంట్‌కు ఓకే అన్న సిఫీ
- ఉపాధిపై యువత ఆశలు

ఓరుగల్లు వైపు.. ఐటీ సంస్థల చూపు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

ఐటీసంస్థలు ఓరుగల్లువైపు చూస్తున్నాయి. హైదరాబాద్ తర్వాత తెలంగాణలో అంతటి ప్రాధాన్యం కలిగిన రెండో నగరం వరంగల్. అదేస్థాయిలో అభివృద్ధి చేసే క్రమంలో 2016లో అప్పటి ప్రభుత్వం ఇక్కడ ఐటీ పార్కును ఏర్పాటు చేసింది. మడికొండ ఐటీ సెజ్‌లో దశల వారీగా సయాంట్, టెక్ మహేంద్ర, జెన్‌ప్యాక్ట్, క్వాంట్రెంట్ రిసోర్స్‌లు తమ బ్రాంచీలను తెరిచాయి. సుమారు మూడేళ్ల కిందట రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో రూ.1,656 కోట్లతో 196 ఎకరాల్లో టెక్నాలజీస్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసిన ఫాక్స్‌కాన్.. వరంగల్‌లో బ్రాంచ్ ఏర్పాటుకు అప్పుడే అంగీకారం తెలిపింది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌రావు తదితరులు దావోస్ పర్యటన సందర్భంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పలు కంపెనీలతో అగ్రిమెంట్ జరిగిన సంగతి తెలిసిందే. ప్రముఖ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ సంస్థ సిఫీ వరంగల్‌లో బ్రాంచీని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ప్రభుత్వం ఐటీ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్న తరుణంలో తాజాగా ఐటీరంగ సంస్థలు ఓరుగల్లు వైపు చూస్తుండడంపై యువతలో 'ఉపాధి' ఆశలు చిగురిస్తున్నాయి.

త్వరలోనే మరిన్ని ఐటీ కంపెనీలు..

టెక్ మహేంద్ర ప్రస్తుతం హైదరాబాద్‌లోనే కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, సయాంట్, జెన్‌ప్యాక్ట్, క్వాడ్రంట్ రిసోర్సెస్‌తో పాటు సాఫ్ట్‌పాత్ వంటి సంస్థలు ఓరుగల్లులో తమ బ్రాంచీలను నిర్వహిస్తున్నాయి. సిఫీ తాజాగా ఎంఓయూ కుదుర్చుకోవడంతో మరిన్ని ఐటీ సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్నట్లు వరంగల్ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో సుముఖత వ్యక్తం చేసిన హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్, హెక్సాడ్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఐటీ కంపెనీలతో చర్చలు జరిపినట్లు సమాచారం. విస్తరణ బాటలో ఉన్న అమెరికాలోని హ్యూస్టన్‌కి చెందిన టెక్‌వేవ్ సంస్థ కూడా ఓరుగల్లులో బ్రాంచ్‌ని తెరిచే యోచనలో ఉందని తెలిసింది. ఇండియన్ ఎన్నారైలకు చెందిన ఈ ఐటీ సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సయాంట్, జెన్‌ప్యాక్ట్, సాఫ్ట్‌పాత్, క్వాడ్రంట్ రిసోర్సెస్ సంస్థల సరసన ఫాక్స్‌కాన్, హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్, హెక్సాడ్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, టెక్‌వేవ్ తదితర ఐటీ కంపెనీలు చేరితే రెండు వేల వరకు కొత్త ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న మామునూరు ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణ ప్రయత్నాలు ముందుకు సాగుతుండడంతో హైదరాబాద్ కేంద్రంగా ఐటీ సేవలందిస్తున్న సంస్థలు వరంగల్ వైపు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా.. హెల్త్‌సిటీ, ఎడ్యుకేషన్ హబ్‌గా పేరున్న వరంగల్ త్వరలో ఐటీహబ్‌గా మారే అవకాశాలు ఉన్నాయి.

నిరుద్యోగ యువతకు ఉపాధి



మరిన్ని ఐటీ కంపెనీలు వస్తే చదువుకున్న యువకులకు ఉన్న చోటనే ఉద్యోగాలు చేసుకునే అవకాశం వస్తుంది. వరంగల్ (మడికొండ)లో ఐటీ కంపెనీలు ఏర్పడడం వల్ల ఉద్యోగం కోసం బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదు. బీటెక్ పూర్తి కాగానే నాకు సొంత ఊరిలోనే సయాంట్ కంపెనీలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

- దార ధనుంజయ్, మడికొండ

సయాంట్‌లో పనిచేయడం ఆనందంగా ఉంది



వరంగల్ కేంద్రంగా, స్థానికంగా పనిచేయడం ఆనందంగా ఉంది. ఎక్కడికో వెళ్లి ఉద్యోగం చేయడం కంటే ఉన్న ఊర్లోనే కుటుంబసభ్యులతో కలిసి ఉంటూ పని చేస్తున్నా. మరికొన్ని కంపెనీలు వస్తే స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ప్రభుత్వం మరింత చొరవ చూపాలి.

- సాయి తేజ, హన్మకొండ



న్యూస్‌రీల్

ముగిసిన 'జేఈఈ' పరీక్షలు

విద్యారణ్యపురి: దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్ ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. హనుమకొండ, వరంగల్‌లో కలిపి 5 సెంటర్లలో కొనసాగుతున్న పరీక్షల చివరిరోజు ఒకే సెషన్ పరీక్షకు 754 మందికి 574 మంది విద్యార్థులు హాజరైనట్లు సిటీ కో–ఆర్డినేటర్ కె.శ్రీలతారెడ్డి తెలిపారు.

ఎంజీఎం పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌గా కిశోర్



ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న డాక్టర్ కిశోర్ గురువారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ మురళి నవంబర్ 14 నుంచి సెలవులో వెళ్లడంతో పాటు సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డికి పత్రాన్ని సమర్పించారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా సిద్దిపేట ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కిశోర్ ఎంజీఎంకు బదిలీ అయి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. పూర్తి స్థాయి సూపరింటెండెంట్ లేక ఆస్పత్రిలో నెలకొంటున్న ఆర్థిక పరమైన ఇబ్బందుల దృష్ట్యా కలెక్టర్ సత్యశారద కిశోర్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో ఉత్తర్వులు జారీ చేశారు.

కుస్తీలో తొలి స్వర్ణం



వరంగల్ క్రైం: కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ నవీన్ రెజ్లింగ్ (97 కిలోల ఫ్రీ స్టైల్ విభాగం) పోటీల్లో హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారుడిపై విజయం సాధించారు. నవీన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తొలి బంగారు పతకాన్ని సాధించి పెట్టాడు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝూతో పాటు జట్టు మేనేజర్ నాగయ్య అభినందనలు తెలియజేశారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు



వరంగల్ అర్బన్: భవన నిర్మాణదారులు నిబంధనలు పాటిస్తేనే అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. నగర పరిధి పలు ప్రాంతాల్లో లేఔట్ల ఏర్పాటు, బిల్డింగ్ నిర్మాణ అనుమతుల మంజూరుకు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అమ్మవారిపేట, మడికొండ, వడ్డేపల్లి ప్రాంతాల్లో కొలతలు వేసి సమాచారాన్ని ధ్రువీకరించి నమోదు చేసుకున్నారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, అసిస్టెంట్ సిటీప్లానర్లు ఎర్షాద్, రజిత తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థం.. రూ.కోట్ల వ్యాపారం

నగరంలోని చికెన్ సెంటర్ల నుంచి ప్రతినెలా వసూళ్లు

- చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- 'గ్రేటర్'కు చెల్లించేది నామమాత్రమే
- మరికొద్ది నెలల్లో ముగియనున్న టెండర్ గడువు
- తిరిగి దక్కించుకునేందుకు కాంట్రాక్టర్ల పోటాపోటీ



నగరంలో చికెన్ సెంటర్ల నుంచి సేకరించిన వ్యర్థాలను తరలిస్తున్న వాహనం

నగరంలో చికెన్ సెంటర్లు **1500**
ప్రతిరోజూ ఉత్పత్తయ్యే వ్యర్థాలు **4** నుంచి **5**వేల కిలోలు
వ్యర్థాలను కిలోల చొప్పున విక్రయిస్తే : రూ.**80**వేల నుంచి లక్ష (రోజుకు)
ఏటా కోళ్ల వ్యర్థాలతో ఆదాయం : రూ.**2.65** కోట్ల నుంచి రూ. **3.60**కోట్లు

వరంగల్ అర్బన్ : కోళ్ల వ్యర్థాలే కదా అని తీసిపారేయకండి. ఆ వ్యర్థాలే కాంట్రాక్టర్‌కు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. సదరు కాంట్రాక్టర్ బల్దియాకు నామమాత్రపు చెల్లింపులు చేస్తూ, మిగతాది జేబులో వేసుకుంటున్నారు. అధికారులు తమకు వచ్చే నెలవారీ కమిషన్లే మహా భాగ్యమంటూ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో 'గ్రేటర్' ఆదాయానికి గండిపడుతోంది. ఇది ఎలా అనుకుంటున్నారా.. అయితే కథనం పూర్తి చదవండి. నగరంలో సుమారు 1,500కు పైగా చికెన్ సెంటర్లు ఉన్నాయి. ఇక కాలనీల్లో చిన్నా, చితకా 500కుపైనే ఉంటాయి. ఈ చికెన్ సెంటర్ల నుంచి ప్రతిరోజూ సుమారు 4వేల నుంచి 5వేల కిలోల వరకు వ్యర్థాలు ఉత్పన్నమవుతాయి. గతంలో వ్యర్థాలను బయట పోసేందుకు చికెన్ సెంటర్ల యజమానులు అష్టకష్టాలు పడేవారు. కొన్నేళ్లుగా ఆ వ్యర్థాలకు డిమాండ్ పెరిగింది. కోళ్లదాణా, చేపల చెరువులకు ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బల్దియా ఆధ్వర్యంలో సేకరించేందుకు టెండర్ నిర్వహించారు. అందులో టెండర్ దక్కించుకున్న వ్యక్తి ఉచితంగా వ్యర్థాలు సేకరించి బయటి మార్కెట్‌లో విక్రయించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం కిలో వ్యర్థానికి రూ.20 చొప్పున ధర పలుకుతుంది. ఇలా నగరంలో రోజుకు రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షల వ్యాపారం సాగుతోంది. ప్రతిఏటా కోళ్ల వ్యర్థాల వ్యాపారం రూ.2.50 కోట్ల నుంచి 3.10కోట్ల వరకు వ్యాపారం సాగుతుంటుంది. ప్రతీ శనివారం, సోమవారం, గురువారం విధిగా కాంట్రాక్టర్లు చికెన్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. చికెన్ సెంటర్ల యజమానులు వ్యర్థాల సేకరణ నిమిత్తం బల్దియాకు యూజర్‌చార్జీలు చెల్లిస్తారు. కానీ కాంట్రాక్టర్ నెలనెలా వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని దుకాణాల్లో సేకరించకుండా ఉండడంతో దుర్వాసన భరించలేని వారు కాంట్రాక్టర్ అడిగిన డబ్బులు ముట్టజెబుతుండడం గమనార్హం.

పేరుకే టెండర్.. అంతా మామూళ్ల వ్యవహారం

కోళ్ల వ్యర్థాల తరలింపునకు టెండర్ నిమితమాత్రమే. కానీ దానికి వెనుక పెద్దఎత్తున చేతులు మారుతున్నాయి. బల్దియాకు ప్రతినెలా రూ.70వేలు సదరు కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారు. కానీ సదరు కాంట్రాక్టర్ 2వేలకు పైగా ఉన్న చికెన్ సెంటర్ నిర్వాహకుల వ్యర్థాల తరలింపు పేరిట నెలకు రూ.300 నుంచి రూ. 500 వరకు ప్రతీషాపునుంచి వసూలు చేస్తున్నాడు. అంతేకాకుండా చికెన్ వ్యర్థాలను తిరిగి కోళ్ల దాణ చేపల చెరువులకు తరలిస్తూ రూ.కోట్లు సమకూర్చుకుంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వరంగల్ పశ్చిమ కీలకనేత సిఫార్సు మేరకు టెండర్ అప్పగించారు. మరికొద్ది నెలల్లో ఈ టెండర్ కాలం గడువు ముగియనుండడంతో కాంట్రాక్టర్లు ఓ మంత్రి ద్వారా తమకే టెండర్ దక్కేలా బల్దియా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వ్యర్థాల సేకరణకు నెలనెలా వసూళ్లు, ఆ వ్యర్థాలకు బయటి మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో సేకరణ, తరలింపు టెండర్‌కు కాంట్రాక్టర్లు పోటీపడుతున్నారు.

నిబంధనల మేరకు వసూలు చేస్తున్నాం

కోళ్ల వ్యర్థాలకు ఏడాదిన్నర క్రితం టెండర్లు జరిగాయి. ఆ నిబంధనల మేరకు కాంట్రాక్టర్ నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాం. చికెన్ సెంటర్ల యజమానులనుంచి డబ్బులు వసూలు చేయొద్దు. నాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటా.

– రాజారెడ్డి, బల్దియా సీఎంహెచ్



శోభాయాత్రలో పాల్గొన్న చినజీయర్ స్వామి, కళాకారులు, భక్తులు

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

సనాతన ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలి.. సంకీర్తన ప్రవచనాలు వింటే పుణ్యంతోపాటు మోక్షం సిద్ధిస్తుందని త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి పేర్కొన్నారు. సంకీర్తన ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. - వివరాలు 8లో ▸

తూర్పు కాంగ్రెస్‌లో తీన్మార్!

మూడు వర్గాలుగా అధికార పార్టీ నాయకులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకం తూర్పు కాంగ్రెస్‌లో దుమారం రేపుతోంది. వరంగల్ మండలంలో ఒక్కరికి కూడా మార్కెట్ కమిటీలో చోటు దక్కకపోవడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాశిబుగ్గ, లక్ష్మీపురం ప్రాంతాలకు చెందిన ఇద్దరు సీనియర్లకు మార్కెట్ పాలకవర్గంలో చోటు కల్పిస్తామని అధికార పార్టీ ముఖ్యనేతలు హామీ ఇచ్చారు. తమకు తప్పకుండా అవకాశం వస్తుందని ఆశతో ఎదురు చూసిన నాయకులు.. పాలకవర్గంలో పేర్లు లేకపోవడంతో తలెత్తుకోని పరిస్థితులు నెలకొన్నట్లు తెలుస్తోంది. పార్టీలో మూడు వర్గాలుగా నాయకులు, కార్యకర్తలు చెలామణి అవుతున్నారు. పాత సీనియర్ల వర్గానికి సీనియర్ నాయకుడు, ఒక వర్గానికి ధర్మారానికి చెందిన నాయకుడు, మరో వర్గానికి ఎల్‌బీనగర్‌కు చెందిన నాయకుడు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఇందులో కాంగ్రెస్‌లోకి వచ్చిన ఒకే గ్రూపునకు చెందిన వారికి మార్కెట్ పదవులు లభించడంతో మరోవర్గం నాయకులు ఎల్‌బీనగర్‌లోని సీనియర్ నాయకుడి ఇంట్లో సమావేశమై బహిరంగంగానే అసంతృప్తిని వ్యక్తం చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో జెండాలు మోసిన తమకు న్యాయం జరగలేదని నాయకులు, కార్యకర్తలు తన ఇంటికి వచ్చి అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సీనియర్ నాయకుడు నల్గొండ రమేశ్ తెలిపారు. క్యాంపు కార్యాలయానికి వెళ్లినా కొత్తగా పార్టీలోకి వచ్చిన వారే ముందు ఉంటున్నారని, ఎన్నికల సమయంలో టికెట్ రాదని, వస్తే గెలవరని ప్రచారం చేసిన నాయకులే ఇప్పుడు కార్లలో కొండా దంపతుల ముందు ఉంటున్నారని అసంతృప్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. కొండా దంపతుల దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చినట్లు రమేశ్ తెలిపారు.



సీనియర్ నాయకుడు నల్గొండ రమేశ్ ఇంటికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

236 మందికి టూడీ ఎకో పరీక్షలు

గుండె పరీక్షల శిబిరానికి అనూహ్య స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రం(డైక్)లో గురువారం చిన్న పిల్లల కోసం నిర్వహించిన గుండె పరీక్షల శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో 236 మంది పిల్లలకు గుండె సంబంధ టూడీ ఎకో పరీక్షలు నిర్వహించగా 75 మంది చిన్నారులకు శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. 15 మందిని నిర్ధారణ కోసం ఇతర పరీక్షల నిమిత్తం రెఫర్ చేసినట్లు డీఎంహెచ్ఓ సాంబశివరావు తెలిపారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారిని ఆరోగ్య శ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. చిన్న పిల్లల్లో వచ్చే గుండె సంబంధ వ్యాధులను డీఈఐసీ ద్వారా ముందే గుర్తించి శస్త్ర చికిత్స చేస్తే భవిష్యత్‌లో వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటుందని చెప్పారు. అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యాన ఎంజీఎం ఆస్పత్రిలో డీఈఐసీ, ఆర్‌బీఎస్‌కే మొబైల్ టీమ్స్ సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, ఆర్ఎంఓ అంబి శ్రీనివాస్, డీఐఓ ప్రకాశ్, డీఈఐసీ పీడియాట్రిషియన్ మంజుల, వైద్యులు శ్రీలక్ష్మి, మేనేజర్ అనిల్, అపోలో ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఈవెనింగ్ స్నాక్స్

ఒక్కొక్కరికి రూ.15 చొప్పున వ్యయం

- రేపటి నుంచి 38 రోజులపాటు..
- ఉమ్మడి జిల్లాలో 15,742 మంది విద్యార్థులు
- రూ.90,35,640 నిధులు మంజూరు



విద్యారణ్యపురి: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూళ్లలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. మార్చి 21 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉదయం పాఠశాల సమయానికి ముందు ఒకగంట, సాయంత్రం పాఠశాల సమయం ముగిశాక మరో గంట పాటు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 5.30 గంటల వరకు ఉండాల్సి వస్తున్నది. ఈ క్రమంలో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఈవినింగ్‌స్నాక్స్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డీఈఓలకు తాజాగా ఆదేశాలు జారీచేశారు.

ఫిబ్రవరి ఒకటి నుంచి స్నాక్స్

పదో తరగతి విద్యార్థులకు ఈవినింగ్ స్నాక్స్ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 20 వరకు 38 రోజులపాటు అమలు చేయనున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున వ్యయం అవుతుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం నుంచి నిధులు కూడా మంజూరయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15,742 మంది విద్యార్థులకు రూ.90,35,640 నిధులు మంజూరయ్యాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల అకౌంట్లలోకి వీటిని విడుదల చేయనున్నారు.

ఆరు రకాల స్నాక్స్..!

టెన్త్ విద్యార్థులకు రోజుకో రకం చొప్పున వారంలో ఆరు రోజులు ఆరు రకాల స్నాక్స్ ఇచ్చే అవకాశం ఉంది. ఉడకబెట్టిన పెసర్లు, బొబ్బెర్లు, శనగలు, పల్లీపట్టి, మిల్లెట్ బిస్కెట్స్, ఉల్లిగడ్డ పకోడి అందించాలని నిర్ణయించారు. ఈ స్నాక్స్ కూడా మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారానే చేయించి విద్యార్థులకు అందించాలని డీఈఓలకు ఆదేశాలు వచ్చాయి.

జిల్లాల వారీగా పదో తరగతి విద్యార్థుల సంఖ్య, మంజూరైన నిధుల వివరాలు

జిల్లా	విద్యార్థులు	నిధులు(రూ.ల్లో)
హనుమకొండ	2,834	16,15380
వరంగల్	3,474	19,80180
జనగామ	3,068	17,48760
భూపాలపల్లి	1,563	8,96610
మహబూబాబాద్	3,727	21,81390
ములుగు	1,076	6,13320
మొత్తం	15742	రూ.9035640

సాగులో నూతన పద్ధతులు పాటించాలి

కిసాన్ మేళాలో కలెక్టర్ సత్యశారద

మామునూరు: రైతులు సమీకృత వ్యవసాయం చేయాలని, అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే ఖర్చులు తగ్గి పంట దిగుబడి పెరుగుతుందని కలెక్టర్ సత్యశారద సూచించారు. మామునూరు పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగుపై గురువారం కిసాన్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన పద్ధతులతో వ్యవసాయం చేయాలని కోరారు. జిల్లా వ్యసాయ అధికారి అనురాధ, డాక్టర్ రాజన్న, కిషన్‌కుమార్, అరుణ్ జ్యోతి, సౌమ్య, శశాంక్, హర్ష, సాయి చంద్, సుశ్రుత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

కెరీర్ గైడెన్స్ శిక్షణ వినియోగించుకోవాలి

డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందుకు ఉపాధ్యాయులకు కేరీర్ గైడెన్స్‌పై రెండ్రోజులపాటు జరిగే ఈశిక్షణను వినియోగించుకోవాలని హనుమకొండ డీఈఓ వాసంతి కోరారు. జిల్లాలో ఎంపికచేసిన 143 పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు గురువారం హనుమకొండలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శిక్షణ ప్రారంభించారు. ఈశిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పాఠశాలల్లోని విద్యార్థుల నేపథ్యం, సామాజిక అవసరాన్ని బట్టి పాఠశాలల్లో అభ్యసన సంబంధిత సమస్యలుంటాయన్నారు. అలాంటి సమస్యలను ఎలా పరిష్కరించాలో ఈశిక్షణలో మెలకువలు నేర్చుకుని బోధించాలన్నారు. పరీక్షలంటే భయం పోయేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. శిక్షణలో హనుమకొండలోని ప్రభుత్వ విద్యాకశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్‌అబ్దుల్‌హై, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ కో–ఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి, రీసోర్స్ ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, సీహెచ్ శ్రీనివాస్, అయిత శ్రీనివాస్, సునీత, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

క్లుప్తంగా

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వేణు


గొలనకొండ వేణు

నర్సంపేట: ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన గొలనకొండ వేణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనగామ జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.నిరంజన్.. గొలనకొండ వేణును అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తనను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అభివృద్ధి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటు పడతానని పేర్కొన్నారు.

కాజీపేట మీదుగా కుంభమేళాకు రైళ్లు

కాజీపేట రూరల్ : కుంభమేళా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా నాలుగు ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు గురువారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..
ఫిబ్రవరి 18వ తేదీన మౌలాలి-బనారస్ (07087) ఎక్స్‌ప్రెస్ 02.08 గంటలకు, 22వ తేదీన మౌలాలి-అజాంఘర్ (07707) ఎక్స్‌ప్రెస్ 02.08 గంటలకు, 15వ తేదీన మౌలాలి-గయా (07089) ఎక్స్‌ప్రెస్ 19.43 గంటలకు, 18వ తేదీన వికారాబాద్-గయా (07091) ఎక్స్‌ప్రెస్ 19.43 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

టోల్ ఫ్రీ నంబర్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం

● హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ

హన్మకొండ: టోల్ ఫ్రీ నంబర్ 1912తో అన్ని విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని టీజీఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. ఈ క్రమంలో టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్ నిరంతరాయంగా పని చేస్తుందన్నారు. వారానికి 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ నంబర్‌ను వినియోగదారుల ముంగిటికి తీసుకెళ్లేందుకు ప్రతీ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ముద్రిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో తలెత్తే ఇబ్బందులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, లోఓల్టేజీ, బ్రేక్ డౌన్స్, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, విద్యుత్ లైన్లు, విద్యుత్ బిల్లుల సమస్యలు, తదితర ఏ సమస్యనైనా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఫిర్యాదులు పరిష్కారమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

● పోక్సో కేసు నమోదు

తరిగొప్పుల: మండల కేంద్రానికి చెందిన చిన్నారిపై ఓ వృద్ధుడు(60) లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారికి వృద్ధుడు చాక్లెట్ ఇస్తానని ఆశచూపి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నిస్తుండగా చిన్నారి తల్లి గమనించింది. స్థానికుల సాయంతో నిందితుడిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ ఘటనపై చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కేయూ రిజిస్ట్రార్‌గా రాంచంద్రమేనా?

నేటితో ముగియనున్న మల్లారెడ్డి పదవీకాలం

● రిజిస్ట్రార్ పోస్టు కోసం పలువురు ఆసక్తి..
● సీడీసీ డీన్ కోసం, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ పోస్టు కోసం కూడా..
● పాలనపరమైన మార్పులేవీ చేపట్టని ప్రతాప్‌రెడ్డి



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి నియామకమై మూడు నెలలు గడిచాయి. అయినా ఇంకా ఎలాంటి పాలన పరమైన మార్పులు చేయలేకపోతున్నారు. గత వీసీ హయాంలో నియామమైన పలువురు ప్రొఫెసర్లు ఇప్పటికీ అవే పోస్టుల్లో కొనసాగుతున్నారు. అయితే కొందరు ప్రొఫెసర్లు కొన్ని పోస్టులు ఆశిస్తున్నప్పటికీ ఆయా పోస్టుల్లో పాతవారినే కొనసాగిస్తుండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ప్రొఫెసర్లు ఒక్కొక్కరు రెండు, మూడు, నాలుగు పోస్టుల బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రిజిస్ట్రార్ పోస్టు కోసం పైరవీలు?

కేయూ రిజిస్ట్రార్ పోస్టు కోసం ఈసారి పలువురు ప్రొఫెసర్లు పైరవీలు ప్రారంభించారని తెలుస్తోంది. ఒకరైతే ఓయూ మాజీ వీసీ ద్వారా ప్రస్తుత కేయూ వీసీ ప్రతాప్ రెడ్డికి కూడా ఫోన్ చేయించినట్లు పలువురు చెబుతున్నారు. మరో ప్రొఫెసర్ స్థానిక ప్రజాప్రతినిధి ద్వారా, మరి కొందరు వీసీ ప్రతాప్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న కాకతీయ యూనివర్సిటీ రిటైర్ ప్రొఫెసర్లతో పైరవీలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్‌గా ఎవరిని నియమిస్తారా అనే అంశం కొద్ది రోజుల్లో తేలనుంది.

రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాంచంద్రమేనా?.. నేటితో ముగియనున్న మల్లారెడ్డి పదవీకాలం

కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి పదవీకాలం నేటి(ఈనెల 31)తో ముగియబోతుంది. ప్రతాప్‌రెడ్డి వీసీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన నలుగురు ప్రొఫెసర్లు రిజిస్ట్రార్ పోస్టు ఆశిస్తున్నారు. ఇందులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుతం ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్, సీడీసీడీన్, విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. రాంచంద్రాన్ని రిజిస్ట్రార్‌గా నియమిస్తారని యూనివర్సిటీలో చర్చగా ఉంది. అయితే ఎస్టీ,బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్లు కూడా ఆ పోస్టును ఆశిస్తున్నా రాంచంద్రం వైపే వీసీ మొగ్గుచూపుతున్నట్లు సమాచారం.

రిజిస్ట్రార్‌గా రాంచంద్రాన్ని నియమిస్తే నాలుగు పోస్టులు ఖాళీ..

ప్రొఫెసర్ రాంచంద్రాన్ని రిజిస్ట్రార్‌గా నియమిస్తే నాలుగు పరిపాలన పదవులు ఖాళీ అవుతాయి. ఇందులో కీలక రెండు పదవులున్నాయి. సీడీసీ డీన్, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ పదవులు ఉండడంతో రాంచంద్రాన్ని రిజిస్ట్రార్‌గా నియమించిన అనంతరం సీడీసీ డీన్ పోస్టులో తమను నియమించాలని ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ కోరుతున్నారని సమాచారం. అలాగే, ఈ పోస్టును మరో మహిళా ప్రొఫెసర్ కూడా ఆశిస్తున్నట్లు తెలిసింది. ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ పోస్టును వై. వెంకయ్య, ఈసం నారాయణ ఆశిస్తున్నట్లు సమాచారం.

కేయూ ఓఎస్‌డీ పదవి ఆ నలుగురిలో ఒకరికి..

కేయూలో ఓఎస్‌డీని నియమించుకుని పాలన చేయాల్సిన సంప్రదాయం ఎప్పుడూ లేదు. రాష్ట్రంలో పెద్ద యునివర్సిటీ ఓయూ పరిపాలన సౌలభ్యం కోసం ఓఎస్‌డీ నియామకం చేసుకుంటున్నారు. అయితే ఉస్మానియా యునివర్సిటీలో విధులు నిర్వర్తించిన ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి.. కేయూ వీసీగా నియామకమైన తర్వాత ఓఎస్‌డీ నియామకంపై చర్చ జరుగుతుంది. ఓఎస్‌డీ పదవికి ఒక ప్రొఫెసర్‌కు అవకాశం ఇవ్వబోతున్నారు. ప్రధానంగా నలుగురు పేర్లు వినబడుతున్నాయి. ఇందులో ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మామిడాల ఇస్తారి ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరిని ఓఎస్‌డీగా త్వరలోనే నియమించబోతున్నారు.

నియామకాలపై జాప్యం..

కేయూలో కొత్త వీసీ నియామకమై మూడు నెలలైనా ఇప్పటి వరకూ కీలక పరిపాలన పదవులు మార్చకపోవడంతో పలువురు ప్రొఫెసర్లు వీసీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కేయూ మహిళా టీచర్లు.. వీసీని కలిసి అడ్మినిస్ట్రేషన్ పదవులపై మాట్లాడినట్లు తెలిసింది. కొన్ని సంవత్సరాల నుంచి కొందరు మాత్రమే ప్రొఫెసర్లు అడ్మినిస్ట్రేషన్ పదవుల్లో ఉంటున్నారని, అందరికీ అవకాశం కల్పించాలని అడిగినట్లు తెలిసింది. గతంలో కేయూ టీచర్ల సంఘం అకుట్ కూడా వీసీకి దీనిపై రిప్రజెంటేషన్ ఇచ్చిందని తెలిసింది. అయినా ఇప్పటి వరకు రెండు, మూడు అడ్మినిస్ట్రేషన్ పదవులు ఒకే ప్రొఫెసర్ చేస్తుండడం ఆ పదవులను మార్చకపోవడం వీసీ పాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

● త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి
● ఆర్ట్స్ కళాశాల మైదానంలో సంకీర్తన ప్రవచనాలు


మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

హన్మకొండ కల్చరల్ : సనాతన ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలను పరరక్షించడానికి కృషి చేయాలని తిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. గురువారం వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్ ఆధ్వర్యాన హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో చిన జీయర్‌స్వామి నేతృత్వాన సంకీర్తన ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. తొలుత జీయర్‌స్వామికి మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన టాప్‌లెస్ జీప్‌లో జీయర్‌స్వామి పబ్లిక్ గార్డెన్ నుంచి బయలుదేరి ర్యాలీగా ఆర్ట్స్ కళాశాల మైదానం వేదిక వరకు చేరుకున్నారు. అనంతరం సంకీర్తన ప్రవచనాలను ప్రారంభించి మాట్లాడారు. వరంగల్ నగరం భక్తి ప్రవాహంలో మునిగి తెలుతోందని, సంకీర్తన ప్రవచనాలు వింటే ఎంతో పుణ్యం, మోక్షం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గురువులు పిల్లలకు జ్ఞానం, సంస్కృతి, ఆచారాన్ని అందిస్తే సమాజంలోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో దేవనాథ జీయర్‌స్వామి, సెంట్రల్ వికాస తరంగిణి సభ్యులు భవానీప్రసాద్, రమణమూర్తి, జిల్లా మాజీ అధ్యక్షులు ఆచార్య పాకనాటి జ్యోతి, బాధ్యులు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, నేపాల్‌కు చెందిన కృష్ణమాచార్య స్వామి, నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమ, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శోభాయాత్ర

ఉదయం పబ్లిక్ గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యం, బంజారా నాట్యం, బోనాలు, భజనలు, చెక్క భజన, ఒగ్గు కథలు, చిందు, యక్షగానం, హరికథా, చిడుతల రామాయణం తదితర 14 రకాల కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రామ, గోవింద నామాలతో శ్రీమన్నారాయణుడిని స్మరిస్తూ వేలాది మంది మహిళలు శోభాయాత్రలో పాల్గొన్నారు.


ప్రవచన కార్యక్రమానికి హాజరైన భక్తులు

బాధిత మహిళలకు అండగా 'సఖి'

● సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పల్లెపాడు దామోదర్



మాట్లాడుతున్న దామోదర్

హన్మకొండ: సమాజంలో శారీరక, మానసిక, లైంగిక హింసకు గురవుతున్న మహిళలకు సేవలు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సఖి సెంటర్ నిర్వహిస్తున్నట్లు ఆ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. గురువారం హనుమకొండలోని సఖి సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న వివిధ రకాల వేధింపులు, హింసల నుంచి రక్షణ కల్పించడానికి సఖి వన్ స్టాప్ సెంటర్ 24 గంటల పాటు పని చేస్తున్నదని చెప్పారు. బాధిత మహిళలు నేరుగా సఖి సెంటర్‌ను ఆశ్రయించొచ్చని, అలాగే హెల్ప్‌లైన్ నంబర్ 181కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. బాధిత మహిళలకు సఖి సెంటర్‌లో కౌన్సెలింగ్, వైద్య, పోలీస్, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో సెంటర్ అడ్మిన్ ఎస్.హైమావతి, డి.వి కౌన్సిలర్ పావని, లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కౌన్సిలర్ విజయలక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

● హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతిలాక్రా


మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ స్వాతిలాక్రా

వరంగల్ క్రైం: డయల్ 100 ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి ఘటనా స్థలికి చేరుకోవాలని హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లాక్రా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీకి సీపీ అంబర్ కిశోర్ ఝూ స్వాగతం పలకగా సాయుధ పోలీసులు గౌరవవందనం చేశారు. అనంతరం పోలీస్ అధికారులతో సమావేశం కాగా కమిషనరేట్ విభాగం పనీతీరు, శాంతి భద్రత నియంత్రణలో భాగంగా తీసుకుంటున్న చర్యలపై సీపీ అంబర్‌కిశోర్ ఝూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ స్వాతి లాక్రా మాట్లాడుతూ మహిళలకు సంబంధించి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బాధితులకు న్యాయం కల్పించడంతో పాటు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు కచ్చితంగా కేసు నమోదు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత పీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, విద్యార్థుల్లో ట్రాఫిక్, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రతి కళాశాలలో సేఫ్టీ ఉమెన్, యాంటీ డ్రగ్స్, సేఫ్టీ ట్రాఫిక్, యాంటీ ర్యాగింగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. అనంతరం కమిషనరేట్ కార్యాలయంలోని డాగ్ స్క్వాడ్, ఆర్మ్డ్ రిజర్వ్‌లోని ఆయుధగారంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న కమిషనరేట్ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, రాజమహేంద్రనాయక్, ఏఎస్పీలు చేతన్, మనాన్ భట్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ గొప్ప వరం

ఎమ్మెల్యేలు కె.వి.రమణారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి
● కాజీపేట బాలవికాసలో తాగునీటి శుద్ధీకరణ పథకం కమిటీల మహాసభ
● హాజరైన నాలుగు రాష్ట్రాల సభ్యులు


మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కె.వి.రమణారెడ్డి

కాజీపేట రూరల్ : ప్రజాసేవ గొప్ప వరమని, బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా లాంటి బిడ్డ వరంగల్‌లో పుట్టి కెనడాలో స్థిరపడి సొంత గడ్డకు సేవ చేయాలనే ఆలోచన రావడం గొప్ప విషయమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి రమణారెడ్డి అన్నారు. కాజీపేట బాలవికాసలో గురువారం 'సుస్థిర నిర్వాహణ, సుస్థిర పథకాలు' అనే అంశంపై బాలవికాస తాగునీటి శుద్ధీకరణ పథక కమిటీల మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను ముందుగానే గుర్తించి వాటికి అనుగుణంగా పథకాలు రూపొందించి ప్రభుత్వాలకు స్ఫూర్తినిస్తున్న బాలవికాస సేవలు అభినందనీయమన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో శుద్ధి నీటి ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న బాలవికాస సేవలు అమోఘమన్నారు. కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో మరింత దృఢంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా జింగ్రాస్ కెనడా నుంచి ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా కేవలం సేవాదృక్పథంతో ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కమిటీ సభ్యులు అవగాహన కల్పించాలన్నారు. అలాగే, కెనడా నుంచి ఆన్‌లైన్‌లో సోపార్ కెనడా డైరెక్టర్ శోభా మాట్లాడుతూ సృష్టిలో నీరు చాలా ముఖ్యమని, అలాంటి నీటిని ప్రజలందరికీ అందిస్తున్న కమిటీ సభ్యులందరికీ అభినందనలు చెప్పారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి మాట్లాడుతూ 45 ఏళ్లుగా బాలవికాస సేవాకార్యక్రమాలు చేస్తోందని, సుమారు 35 లక్షల మందికి 1,550 శుద్ధి నీటి ప్లాంట్ల ద్వారా రోజూ మంచినీరు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బాలవికాస అధ్యక్షుడు నోముల ఇంద్రారెడ్డి, రైతు వికాస అధ్యక్షుడు కె. రాజమౌళి, జనవికాస అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, డైరెక్టర్లు రాహుల్, సునీతారెడ్డి, మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లతారెడ్డి, ఫ్రాన్సిస్ రెడ్డి, తిరుపతి, మంజుల, శోభ, శివరాం, మోసెస్, విజేందర్, నాలుగు రాష్ట్రాల సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ప్రతిష్ట మరింత పెంచాలి

● పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ
● 254 మంది హెచ్‌సీలు, 225 మంది ఏఎస్సైల పదోన్నతి శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

మామునూరు: పోలీస్ శాఖ ప్రతిష్ట మరింత పెంచేలా ట్రైనింగ్‌ను క్రమ శిక్షణతో పూర్తి చేయాలని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ) సూచించారు. ఏఎస్సైలు(ఏఆర్), హెడ్ కానిస్టేబుళ్ల (ఏఆర్) ప్రమోషన్ ట్రైనింగ్‌లో భాగంగా గురువారం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో 14 రోజుల పాటు నిర్వహించే పదోన్నతి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. 225 మంది ఏఆర్ ఏఎస్సైలు, 254 మంది ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు పదోన్నతి శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేశ్, వెంకటేశ్వరరావు, పాండు నాయక్, భిక్షపతి, ఆర్ఐ చంద్రశేఖర్, మహేశ్, నవీన్, కాశీరామ్, రవీందర్, వడ్డె నరేశ్, సుధాకర్, సత్యనారాయణ, దీపక్, సమ్మిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆర్ ఎస్సైలు రాజేశ్, సుధాకర్, దశరథం, సీసీ రామాంజనేయరెడ్డి, డాక్టర్ సుధీర్, పీఆర్‌ఓ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలు అన్ని రంగాల్లో ముందుండాలి

● కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి


సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, కళాశాల అధ్యాపకులు

హన్మకొండ అర్బన్: స్త్రీలు సహజసిద్ధంగానే పరిపాలనా సామర్థ్యాన్ని కలిగి ఉంటారని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో 'ఫైనాన్సియల్ లిటరసీ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్' అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన గురువారం జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేయాలన్నారు. అనంతరం 116 పరిశోధక పత్ర వ్యాసాలతో కూడిన సావనీర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ అహ్మద్ రాజా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ సురేశ్‌బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ అరుణ, అధ్యాపకులు రాజిరెడ్డి, సుమలత, సురేశ్, హేమలత, హెబ్సిబా, మధు, లక్ష్మీకాంతం, రత్నమాల, సునీత, మమత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలం త్వరగా ఎంపిక చేయాలి

● రైల్వే డీఆర్ఎంను కోరిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


డీఆర్ఎం భర్తీష్‌కుమార్ జైన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, పక్కన ఎంపీ కావ్య

కాజీపేట రూరల్ : కాజీపేట బస్టాండ్ స్థలాన్ని త్వరగా ఎంపిక చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం) భర్తీష్‌కుమార్ జైన్, ఏడీఆర్ఎం గోపాల్, డీఈఎన్ ప్రంజల్‌ను కోరారు. ఇటీవల కాజీపేట రైల్వే స్టేషన్ ముందు ఆవరణంలో కాజీపేట బస్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా అధికారులు, రైల్వే అధికారులు పరిశీలించారు. గురువారం సికింద్రాబాద్ సంచాలన్‌భవన్‌లో డీఆర్ఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. స్థల నివేదికను టెక్నికల్‌గా పునఃపరిశీలించి వీలైనంత త్వరగా బస్టాండ్ నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఆర్ఎం స్పందించి బస్టాండ్ స్థలానికి సంబంధించిన ఫైనల్ రిపోర్టును రైల్వే బోర్డుకు పంపనున్నట్లు తెలిపారని ఎంపీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్, గుంటి కుమార్ ఉన్నారు.

ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణలు అవసరం

● జాతీయ సదస్సులో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణలు అవసరమని, యువ పరిశోధకులు ముందుకురావాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫార్మస్యూటికల్ సైన్సెస్' అనే అంశంపై గురువారం కేయూ సెనేట్‌హాల్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశోధనల్లో సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు ముఖ్యమని పేర్కొన్నారు. మానవ మనుగడ, ఉత్తమ జీవన విధానాన్ని ప్రపంచం కోరుకుంటోందని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో తట్టుకొని రాణించాలంటే అకడమిక్ రీసెర్చ్‌పై శ్రద్ధ వహించాలని చెప్పారు. కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు బలమైన పూర్వవిద్యార్థుల సమూహం ఉందని, విద్యార్థులు ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. 'ఇన్నోవేటివ్ డిస్కవరీ అప్రోచెస్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ కాంప్లమెంటరీ అండ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్' అనే అంశంపై నాందేడ్ శ్రీరామానందతీర్థ్ మరట్వాడా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ శశికాంత్ సిధవాలే కీలకోపన్యాసం చేశారు. కేయూలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యాన యూజీసీ యూనిట్, అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో నోవార్టిస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంసీపీ వేణుగోపాల్, నల్లా మల్లారెడ్డి ఫార్మసీ కాలేజీ డీన్ డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ మహేశ్ అరుందల, యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, బీఓఎస్ ఆచార్య జె.కృష్ణవేణి, ఆచార్య వై.నర్సింహారెడ్డి మాట్లాడారు. అనంతరం పరిశోధన పత్రాల అబ్‌స్ట్రాక్ట్‌ను అతిథులు విడుదల చేశారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్ ఉపయోగకరం


శిక్షణలో మాట్లాడుతున్న సుజన్‌తేజ

కాశోజీ సెంటర్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కౌన్సెలింగ్ ఉపయోగపడుతుందని వరంగల్ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ అన్నారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ అనంతరం ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులను ఉన్నతంగా ఎదిగేలా ప్రేరేపించాలని, ఆత్మస్థైర్యం నింపి పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బత్తుల ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదాబాయి, 142 స్కూల్ అసిస్టెంట్లు, డీఎల్ఎంటీ శ్రీనివాస్, సీఆర్పీలు స్వాతి, అనిత పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు

● డీఆర్ఓ వైవీ గణేశ్


మాట్లాడుతున్న డీఆర్ఓ వై.వి గణేశ్

హన్మకొండ అర్బన్: దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016పై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్ తెలిపారు. కలెక్టరేట్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యా, రెవెన్యూ శాఖల అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వైవీ.గణేశ్ మాట్లాడుతూ.. జిల్లాలోని బ్యాక్‌లాగ్ పోస్టులు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వికలాంగుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వారికి జీఓ నంబర్ 31 ప్రకారం.. ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం, 60 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు ఎన్నికల విధులకు మినహాయింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే.. విద్యాశాఖలో ఉపాధ్యాయ బదిలీల్లో నిబంధనల మేరకు సదరం సర్టిఫికెట్ ఆధారంగా ప్రాధాన్యం కల్పించేందుకు సంబంధిత అధికారులకు సూచించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేశ్‌రాథోడ్, డీడబ్ల్యూఓ జయంతి, డీఎంహెచ్‌ఓ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి మొత్తం కొనుగోలు చేస్తాం

● సీసీఐ సీజీఎం పాణిగ్రహి


పాణిగ్రహి

వరంగల్ : ప్రస్తుత సీజన్ 2024-25(అక్టోబర్ 2024-సెప్టెంబర్ 2025)లో అన్ని రాష్ట్రాలలో కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)పథకం కింద పత్తి మొత్తం కొనుగోలు చేస్తామని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)సీజీఎం(మార్కెటింగ్) ఎస్‌కే.పాణిగ్రహి ఒక ప్రకటనలో తెలిపారు. చివరి వరకు అన్ని గ్రేడ్‌ల పత్తి కొనుగోలు ప్రక్రియ యథావిధిగా సాగుతుందన్నారు. రైతులు ఆందోళనలతో తమ పంటలను విక్రయించాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాలు ఈఏడాది సెప్టెంబర్ వరకు పనిచేస్తాయన్నారు. రైతులు తమ ఉత్పత్తులను విక్రయించడంలో ఎలాంటి సమస్య ఎదురైనా 77189 55728 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ పంపాలని కోరారు.